ఘనంగా రెవెన్యూ దినోత్సవం

మాజీ రెవెన్యూ అధికారులను సత్కరించిన ఆర్డీఓ

మదనపల్లె : సబ్ కలెక్టరేట్‌లో గురువారం మొదటి రెవెన్యూ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ హరిప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులందరూ కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో భాగంగా రెవెన్యూశాఖలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల్లో ఉత్తమ సేవలందించిన రిటైర్డ్ ఏఓ మునిప్రసాద్, రిటైర్డ్ డీటీ సత్యకుమార్‌ను దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ హరిప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు 1786 జూన్ 20వ తేదీన బోర్డు ఆఫ్ రెవెన్యూను బ్రిటీష్ పాలకులు ఏర్పాటు చేశారన్నారు. అరోజును అనధికారికంగా రెవెన్యూడేగా పిలుస్తూ వస్తున్నారన్నారు. దీనిపై 238 సంవత్సరాల తర్వాత ప్రభుత్వం జీఓ.నెంబర్.81ను తీసుకువచ్చి జూన్ 20వ తేదీన రెవెన్యూ డేగా జరుపుకొనేందుకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వంలో అత్యంత కీలక బాధ్యతలు నిర్వహించేది రెవెన్యూ ఉద్యోగులేనని, వీఆర్‌ఏ స్థాయి నుంచి కలెక్టర్ వరకు 24 గంటలూ ప్రజాసేవలోనే ఉంటారన్నారు. భూసంబంధిత బాధ్యతలు, విద్యార్థులకు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాల జారీ, మెజిస్టీరియల్ బాధ్యతలు, ప్రకృతి వైపరీత్యాల్లో పౌరులకు సరైన రక్షణ, వసతి కల్పించడం, ఓటరు నమోదు కార్యక్రమం, ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వహణ బాధ్యతలు, వీఐపీ, వీవీఐపీ, ప్రోటోకాల్ బాధ్యతలను రెవెన్యూశాఖ సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు. రెవెన్యూశాఖపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం రెవెన్యూ డే ఉపయోగపడుతుందన్నారు. రెవెన్యూసిబ్బంది నిస్వార్థంగా పని చేస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సమస్యలతో వచ్చే వారి సంఖ్య గణనీయంగా తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. రెవెన్యూశాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వసేవలైన అడంగల్, ఆర్‌ఎస్‌ఆర్, 1బీ, రెవెన్యూశాఖ దైనందిన కార్యక్రమాలపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు, డివిజనల్ సర్వేయర్ లక్ష్మీనారాయణ, ఎలక్షన్ డీటీ అస్లాం పాల్గొన్నారు.


మదనపల్లె : రిటైర్డ్ ఏఓ మునిప్రసాద్‌ను సన్మానిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్


వాల్మీకిపురం: కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్ ఖాతిజున్ కుప్రా


తంబళ్లపల్లె: రిటైర్డు వీఆర్‌ఓ, వీఆర్‌ఓలను సన్మానిస్తున్న అధికారులు


బి.కొత్తకోట: రిటైర్డ్ వీఆర్‌ఓలను సత్కరించి కేక్ కట్ చేస్తున్న పుణ్యవతి

రెవెన్యూ సమస్యలు పరిష్కరించినప్పుడే సార్థకత

తంబళ్లపల్లె : ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలు పరిష్కరించినప్పుడే ఆ శాఖకు సార్థకత లభిస్తుందని తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధికారులు, రెవెన్యూ ఉద్యోగులు ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. త్వరగా పరిష్కరించినప్పుడే వారికి సంతృప్తి కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని అందరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. అనంతరం రిటైర్డు వీఆర్‌ఓ గంగులప్ప, సీనియర్ గ్రామ సేవకులు ప్రసాద్‌లను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు, రెవిన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలు అందిస్తే గుర్తింపు

వాల్మీకిపురం : మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఖాతిజున్ కుప్రా మాట్లాడుతూ విధుల విషయంలో అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు సేవలందినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం విశ్రాంత కర్ణంలను సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, సర్వేయర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డే కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ పుణ్యవతి కేక్ కట్ చేశారు. రిటైర్డ్ వీఆర్‌ఓలు వెంకటరెడ్డి, నరసింహారావులను సత్కరించారు. అధికారులు, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బడి బయటి పిల్లలను గుర్తించండి

పెద్దతిప్పసముద్రం : బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ నారాయణ ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీ జంగంరెడ్డిగారిపల్లిలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలయ్యేలా చూడాలని టీచర్లకు సూచించారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం : విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విశ్రాంత పోస్టు మాస్టర్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని తబుసం పదో తరగతిలో 530 మార్కులు సాధించి, పాఠశాల మొదటి స్థానంలో నిలిచింది. దీంతో గురువారం ప్రోత్సాహక బహుమతిగా రూ.5116ను విద్యార్థిని తబుసంకు దాత అందజేశారు. వర్ల హనుమంతప్ప, వర్ల సుబ్బమ్మ జ్ఞాపకార్థం ప్రోత్సాహక బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు సుధారాణి, నాగరత్న, శోభారాణి, వసుంధర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహాభారత మహోత్సవం


హరికథ వినిపిస్తున్న భాగవతారిణి జ్యోత్స్న

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో మహాభారత మహోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. మొదట అంకుర్పారణ, నవగ్రహ కలశరాధన, నవగ్రహ హోమం, గణపతిహోమం, ధ్వజారోహణం నిర్వహించారు. మొదటి రోజు ప్రముఖ భాగవతారిణి జ్యోత్స్న మహాభారతంలోని ఆదిపర్వం, భీష్మ ప్రతిజ్ఞ ఘట్టాలను హరికథ రూపంలో వివరించారు. సాయంత్రం వెంకటేశ్వర కళా మండలి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ లీలలు నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో భారతం కమిటీ సభ్యులు వెంకటేష్, డాక్టర్ రామచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మునీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


మునీశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ పూజారి

రామసముద్రం : రామసముద్రం మండలం ఊలపాడు పంచాయతీ నరసాపురం గ్రామ సమీపాన వెలసిన శ్రీమునీశ్వరస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి చిన్న వెంకటప్ప ఉదయాన్నే స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు. మండలంలో ఎక్కడా శ్రీమునీశ్వరస్వామి ఆలయం లేకపోవడంతో ఆలయానికి మండలంలోని భక్తులు, కర్ణాటక వాసులు భారీగా వస్తుంటారు. పుట్టిన పిల్లలకు ఇక్కడే దేవర్లు చేసి తలనీలాలు సమర్పిస్తుంటారు. ఆలయానికి ఎవరైనా దాతలు గానీ ప్రజాప్రతినిధులు గానీ భక్తుల సౌకర్యార్థం రోడ్డు, కరెంటు సౌకర్యం ఏర్పాటు చేయాలని పూజారి చిన్న వెంకటప్ప కోరారు.

ఐటీఐలలో 97 సీట్లు భర్తీ

రాజంపేట టౌన్ : జిల్లాలోని ఐటీఐలలో సీట్ల భర్తీకోసం గురువారం రాజంపేటలోని ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 69 సీట్లు భర్తీ అయినట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ రోజు రాజంపేట ప్రభుత్వ ఐటీఐలో 30 సీట్లు, పీలేరు ప్రభుత్వ ఐటీఐలో 20 సీట్లు, తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో 8 సీట్లు భర్తీ అయ్యాయన్నారు. అలాగే రాయచోటి, రైల్వే కోడూరుల్లోని ప్రైవేట్ ఐటీఐలలో 11 సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు రాజంపేట ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించగా మొత్తం 97 సీట్లు భర్తీ అయ్యాయన్నారు. జిల్లాలోని మూడు ప్రభుత్వ ఐటీఐలలో 392 సీట్లు ఉండగా ఇప్పటి వరకు 77 సీట్లు భర్తీ అయ్యాయని, పన్నెండు ప్రైవేట్ ఐటీఐలలో 1,064 సీట్లు ఉండగా 20 సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. జనరల్ పూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహణకు ఉన్నతాధికారుల అనుమతి కోరామని, అధికారులు అనుమతిస్తే శుక్రవారం జనరల్ పూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం


విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి

మదనపల్లె : విద్యుత్ వినియోగదారుల సమస్యలను ప్రత్యేక విద్యుత్ లోక్‌అదాలత్‌లో అక్కడికక్కడే పరిష్కరిస్తామని చైర్‌పర్సన్, రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక, మదనపల్లె ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు, లోక్‌అదాలత్ కార్యక్రమానికి రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థికసభ్యులు కె.రామమోహనరావు, సాంకేతిక సభ్యులు యస్.యల్.అంజనీకుమార్, స్వతంత్రసభ్యులు జి.ఈశ్వరమ్మలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యుత్ అదాలత్‌లో భాగంగా మదనపల్లె డివిజన్‌లోని బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, నిమ్మనపల్లె, మదనపల్లె రూరల్, అర్బన్, రామసముద్రం మండలాలకు సంబంధించి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాస ఆంజనేయమూర్తి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు సమస్యలు వస్తే అధికారులను నిలదీసే ఫోరమ్, కోర్టు ఉంటుందని వినియోగదారులు గుర్తుంచుకోవాలన్నారు. అందులో న్యాయపరమైన సమస్యలన్నీ పరిష్కరిస్తారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా మెసేజ్, అర్జీ, వాట్సప్ రూపంలో వచ్చిన విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో భాగంగా పట్టణంలోని రామారావుకాలనీలో 33 కే.వి. విద్యుత్‌లైన్ ఇళ్లపై పోతోందని, మార్పు చేయాల్సిందిగా కాలనీవాసులు 30 మంది వరకు వినతిపత్రం సమర్పించారు. మదనపల్లె మండలం తట్టివారిపల్లె పంచాయతీ బాలాజీనగర్, సత్యసాయినగర్, గోకుల్‌వీధిలోని 250 కుటుంబాలకు విద్యుత్ బిల్లు అధికంగా వస్తోందని, లోడ్ ఎక్కువ అవడం, కరెంట్ ఫీజులు ఎగిరిపోవడం తరచూ జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యుగంధర్, ఏడీఈ జీవన్‌కుమార్, సురేంద్రనాయక్, రుక్మాంగధ బాబు, ఏఏఓ కిరణ్‌కుమార్, ఏఈలు నరసింహారెడ్డి, గోవిందరెడ్డి, రెడ్డికుమార్, ముజమ్మిల్, రమేష్, వసంతరెడ్డి, శంకరరెడ్డి, గిరిధర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి హనుమంతు సేవ


ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలుడు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం హనుమంతు సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి హరికథా కాలక్షేపం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ జిలకర సుబ్బయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, ఆలయ పూజారి చంద్రశేఖర్ శర్మ తెలిపారు.

నేడు గరుడ సేవ : వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరవ రోజు అయిన శుక్రవారం గరుడసేవ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి


దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

కలకడ : దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మలేరియ మాసోత్సవాలలో భాగంగా గురువారం పీహెచ్‌సీ పరిధిలోని పాపిరెడ్డిగారిపల్లెలో గృహాలను ఆయన సందర్శించారు. నిల్వ ఉన్న నీటిలో లార్వాలను గుర్తించి, వాటి నివారణకు విధిగా ప్రతి కుటుంబం డ్రై డే పాటించాలని కోరారు. వర్షాకాలంలో నీటి నిల్వ ద్వారా దోమలు వృద్ధి చెంది మలేరియా జ్వరాలు ప్రబలుతాయని తెలిపారు. విషజ్వరాల నివారణకు నీరు నిల్వ ప్రదేశాలలో అబైట్ మందును పిచికారి చేయాలని చెప్పారు. వందల సంఖ్యలో దోమలు ఉంటే వారం రోజుల్లో లక్షలు అవుతాయని గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. దోమతెరలు వినియోగించడం, వేపాకు పొగవేయడం, వృథా వస్తువులకు సాయంకాలం నిప్పు అంటించడం చేయాలని సూచించారు. ఎలాంటి విషజ్వరాలు వ్యాప్తి చెందినా వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయించుకుని వైద్యసేవలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి ముజీబ్‌బాషా, ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సిబ్బంది జమీల్‌అహమ్మద్, సుబ్బరత్నమ్మ, షరీఫ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరపండి


డీపీవో ధనలక్ష్మీకి ఫిర్యాదు చేస్తున్న హబీబ్‌బాషా

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అక్రమాలపై విచారణ జరపాలని సర్పంచ్ ఎస్.హబీబ్‌బాషా గురువారం జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌కు, డీపీవో ధనలక్ష్మీకి ఫిర్యాదు చేశారు. పీలేరు గ్రామ పంచాయతీలో 2023 అక్టోబర్ 4 నుంచి 2024 సెప్టెంబర్ 6 వరకు తాను విడతల వారీగా సెలవు పెట్టడం జరిగిందన్నారు. చివరగా మూడు నెలలు సెలవు పెట్టడం జరిగిందని, దానిని నాలుగు నెలలుగా పంచాయతీ ఈవో గఫూర్ తప్పుడు రికార్డులు సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 18న తన అనుమతి లేకుండా తనకు తెలియకుండా ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో ఈవో గఫూర్, ఇన్‌చార్జి సర్పంచ్ జీనత్ షఫీ, వారి కుమారులు సయ్యద్, జావిద్ కలసి తనకు మానసిక స్థితి సరిగా లేనట్లు, ఒత్తిడికి గురవుతున్నట్లు సర్టిఫికెట్ తీసుకున్నారని తెలిపారు. తద్వారా పై అధికారులు రిపోర్టు పంపించారని తెలిపారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి పంచాయతీ అధికారులపై, ఇన్‌చార్జి సర్పంచ్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిధులు భారీగా పక్కదారి పట్టించారని, దానిపై కూడా విచారణ చేపట్టాలని కోరారు. తాను పదవిలో ఉన్న రెండన్నరేళ్లలో పంచాయతీ నిధులపై ఆడిట్ కూడా జరిగిందని, అన్ని సక్రమంగా ఉన్నట్లు రిపోర్టు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ఈవో గఫూర్ రికార్డులు తారుమారు చేయడమే కాకుండా, తాను విదేశాలకు పారిపోతున్నట్లు కూడా రిపోర్టుల్లో చూపించారని, వీటన్నింటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

అమెలో బ్లాస్టోమాకు అరుదైన శస్త్రచికిత్స



శస్త్రచికిత్స నిర్వహిస్తున్న డాక్టర్ నెమలి చైతన్య బృందం (ఇన్‌సెట్) అమెలో బ్లాస్టోమా శస్త్రచికిత్స చేసిన దృశ్యం

మదనపల్లె : పట్టణంలోని శ్రీ సాయి హాస్పిటల్‌లో నెమలి ఫేషియల్, మల్టీ స్పెషాలిటీ సెంటర్‌కు చెందిన డాక్టర్ నెమలి చైతన్య ఆధ్వర్యంలో 21 ఏళ్ల యువతికి అమెలో బ్లాస్టోమాకు సంబంధించి అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నెమలిచైతన్య మాట్లాడుతూ పెద్ద పెద్ద పట్టణాల్లో కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రమే నిర్వహించే అమెలో బ్లాస్టోమా శస్త్రచికిత్సను స్థానికంగానే మదనపల్లెలో తొలిసారిగా నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. అమెలో బ్లాస్టోమా విచ్ఛేదనం అనేది చాలా అరుదైన శస్త్రచికిత్స అని, ఇది చాలా రకాలుగా ఉంటుందని తెలిపారు. చాలా వేగంగా వ్యాప్తి చెందుతూ మళ్లీ వచ్చే అవకాశం 10 శాతం వరకు ఉంటుందన్నారు. 1 శాతం మందికి క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉందన్నారు. పట్టణానికి చెందిన 21 ఏళ్ల యువతికి కింది దవడ కుడి భాగంలో అమెలో బ్లాస్టోమాగా వైద్యులు నిర్ధారించారన్నారు. దీనికి చికిత్సలో భాగంగా యువతి దవడ నుంచి రెండు సెం.మీ.కింద భాగం నుంచి కోసి వ్యాధి ఉన్నచోట రెండు సెం.మీ. ఎముకను కింది దవడ నుంచి తొలగించడం చేశామన్నారు. ఆ స్థలంలో ఎడమవైపు నడుము నుంచి 4 ఇంటు 2 సెం.మీ. ఎముకను తీసుకుని అమర్చడం జరిగిందన్నారు. చికిత్స విజయవంతంగా పూర్తి చేశామని, పేషంట్ కోలుకుంటోందని, రెండు రోజుల్లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతుందన్నారు.

నీటిని సంరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలి


రామసముద్రం : మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు


కేవీపల్లె : నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కేవీపల్లె : నీటిని సంరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలని ఎంఈవో రెడ్డిబాషా అన్నారు. మిషన్‌లైఫ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని వివిధ పాఠశాలల్లో సేవ్ వాటర్ (నీటి సంరక్షణ) అంశంపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో, ఇంటి వద్ద ఏ విధంగా నీటి సంరక్షణ చర్యలు పాటించాలి, నీటి ప్రాముఖ్యతపై వంటి అంశాలపై వివరించారు. అన్ని పాఠశాలల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వై.వి.రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుసూదన, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ సిగ్బతుల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి వృథా.. రేపటికి వ్యథ

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరు గ్రామ పంచాయతీ కేంద్రంలో గురువారం 'మిషన్‌లైఫ్' కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి మునస్వామినాయక్ ఆధ్వర్యంలో నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నీటి వృథా... రేపటికి వ్యథ అంటూ విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మునస్వామి నాయక్ మాట్లాడుతూ సమస్త జీవకోటికి నీరే ప్రాణాదారమని, నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరు పొదుపుగా వాడుకోవాలన్నారు. ఉన్ననీటిని సద్వినియోగం చేసుకోకుండా, వృథా చేస్తే సమస్త జీవులకు ప్రాణహాని పొంచి ఉందన్నారు. మునసుపెట్టి ఆలోచిస్తే మరుగునీటిని కూడా శుద్ధి చేసి మళ్లీ వినియోగించుకునే మార్గాలు అనేకం ఉన్నాయన్నారు. నీటి సంరక్షణ బాధ్యతకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి సేవ్ వాటర్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది హరీష్, రేవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. బీఎస్‌సీ (హానర్స్) కోర్సుల్లో (జువాలజీ సింగల్ మేజర్, బాటనీ మైనర్), కంప్యూటర్స్ సింగల్ మేజర్, లెక్కలు మైనర్), బికాం హానర్స్‌లో బికాం (సీఏ), బికాం(జనరల్), బి.ఎ (హానర్స్)లో పొలిటికల్ సైన్సు సింగల్ మేజర్, ఎకనామిక్స్ మైనర్), స్పెషల్ తెలుగు, బి.ఎ (హానర్స్), ఉర్దూ మీడియంలో హిస్టరీ సింగల్ మేజర్, పొలిటికల్ సైన్సు మైనర్) సబ్జెక్టులు ఉన్నాయన్నారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

28న లక్కీడిప్

మదనపల్లె సిటీ : మదనపల్లె-తంబళ్లపల్లె మార్గంలో ప్రయాణికుల కోసం ఈ నెల 28న లక్కీడిప్ తీయనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. తంబళ్లపల్లె మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు టిక్కెట్టు వెనుకవైపున పేరు, మొబైల్ నంబర్, ఊరి పేరు రాసి బస్సులోని గిఫ్ట్‌బాక్సులో వేయాలని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

426 మందికి బీసీజీ వ్యాక్సిన్


బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్‌ఎం

తంబళ్లపల్లె : మండలంలో క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా చేపట్టిన బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 426 మందికి బీసీజీ వ్యాక్సిన్ వేసినట్లు డాక్టర్ మునికుమార్ తెలిపారు. మండలంలోని 12 హెల్త్‌క్లినిక్ పరిధిలో ఇప్పటి వరకు 3,018 మందికి బీసీజీ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. తిమ్మయ్యగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఆశాలత పలువురికి వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు. 6,7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకుంటే 27వ తేదీ ఉదయం 9 గంటలకు లక్కిరెడ్డిపల్లి గురుకుల పాఠశాలలో పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అలరించిన హరికథ

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహిస్తున్న మహాభారతయజ్ఞంలో భాగంగా గురువారం చేపట్టిన అరణ్యవాసం హరికథా కాలక్షేపం అలరించింది. మధ్యాహ్నం బంగారుపాళెంకు చెందిన భాగవతారణి టి.రెడ్డికుమారిచే హరికథా కాలక్షేపం నిర్వహించారు. రాత్రి వెంకటేశ్వర నాట్యకళా మండలి మల్లికార్జున బృందంచే ద్రౌపది మాన సంరక్షణ రాత్రి నాటకం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాభారతయజ్ఞం నిర్వహణకు సహకరించిన డిపో మేనేజర్ కుమార్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ యూనియన్ నాయకులు పి.ఎస్.రాజు, యల్లయ్య, కె.కె.నాయుడు, హరి తదితరులు పాల్గొన్నారు.